మున్సిపల్ కమిషనర్‌కు వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దేవేందర్

కుత్బుల్లాపూర్: కొంపల్లి నుంచి బహదూపల్లి వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు అసంపూర్తిగా ఉన్నాయని కాంగ్రెస్ నాయకుడు జెమ్మి దేవేందర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం కొంపల్లి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. తొలగించిన నిర్మాణాల్లో తిరిగి కొన్నింటిని నిర్మించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వెంటనే అక్రమ నిర్మాణాలు తొలగించి వాహనాలు సాఫీగా వెళ్లే విధంగా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

బస్సు డిపో కోసం వినతి



సజ్జనార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సతీష్

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్టలో బస్సు డిపో ఏర్పాటు చేయాలని బీజేపీ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్ కోరారు. ఈ మేరకు మంగళవారం టీజీఎస్ఆర్‌టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్‌కు బస్ భవన్‌లో వినతిపత్రం అందజేశారు. బస్ డిపో ఏర్పాటుకు కావలసిన చర్యలు తీసుకొని వీలైనంత తొందరగా సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.

నేడు శివాజీ మహరాజ్ జయంతి వేడుకలు

నిజాంపేట్: శివాజీ మహరాజ్ జయంతి వేడుకలను బుధవారం ఉదయం 9 గంటలకు నిజాంపేట్‌లోని బొర్రాయి వద్ద ఘనంగా నిర్వహించనున్నట్లు బీజేపీ నిజాంపేట్ అధ్యక్షులు భిక్షపతి యాదవ్, ప్రధాన కార్యదర్శి సచిన్ మంగళవారం తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

అర్చకులపై దాడి చేసే వారిని కఠినంగా శిక్షించాలి



సమావేశంలో పాల్గొన్న అర్చక సంఘం సభ్యులు

కుత్బుల్లాపూర్: హరిహర అర్చక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జీడిమెట్ల డివిజన్ పరిధి సుచిత్రలోని మూడు గుళ్ల దేవాలయంలో అధ్యక్షుడు శ్రీరంగం గోపి కృష్ణమాచార్య అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. అర్చకులపై జరుగుతున్న దాడులు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అర్చకులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి దాడులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేయాలని నిర్ణయించారు. సమావేశంలో శివ స్వామి, సోను దివేది, రఘునాథ ఆచార్యులు, పరుశురాం శర్మ, కులకర్ణి కరుణాకర్ పాల్గొన్నారు

వైష్ణోయ్ ఎన్‌క్లేవ్‌లో నీటి కటకటపై అధికారుల ఆరా!

చింతల్: జీడిమెట్ల సెక్షన్ వైష్ణోయ్ ఎన్‌క్లేవ్ లో 15 రోజులుగా తాగునీటి సరఫరా కావడం లేదు. 'నీళ్ల రాక గొంతెండుతోంది' అనే శీర్షికతో మంగళవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై జలమండలి ఉన్నతాధికారులు ఆరా తీసినట్లు తెలిసింది. వాటర్ వర్క్స్ ఉన్నతాధికారులు కుత్బుల్లాపూర్‌కు సరఫరా అవుతున్న నీరు, అదే విధంగా గోదావరి జలాల నుంచి కేటాయించిన నీటిపై ఆరా తీశారు. ఇక్కడి అధికారులు కూడా తమకు కేటాయించిన నీరు సరిపోవడం లేదంటూ పత్రికలో వచ్చిన కథనాన్ని చూపించి నీటి కేటాయింపులు పెంచేలా చర్యలు తీసుకోవాలని నివేదించినట్లు తెలిసింది.

మద్యానికి బానిసై ఉరేసుకొని ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పేట్ బషీరాబాద్ పోలీసుల కథనం ప్రకారం.. గుండ్లపోచంపల్లి ప్రాంతానికి చెందిన షేక్ చాంద్ పాషా(49) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. మద్యానికి బానిసై ఈ నెల 17వ తేదీన సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు షేక్ అమీర్ ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు వివిధ కోణాల్లో విచారణ చేపడుతున్నారు.

మహనీయులను మరిచారా?

- పనులు పూర్తైనా ప్రతిష్ఠించని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పలు సంఘాలు

జంక్షన్ల అభివృద్ధి పేరుతో విగ్రహాల తొలగింపు



పూర్తి చేసిన ఐడీపీఎల్ జంక్షన్ పనులు



జగద్గిరిగుట్ట: ఐడీపీఎల్, కృష్ణకుంజ్ కుత్బుల్లాపూర్, జగద్గిరిగుట్ట చాకలి ఐలమ్మ జంక్షన్‌ల పనులు పూర్తి చేశారు. దీంతో అక్కడ ట్రాఫిక్ సమస్య కొంతమేర తగ్గింది. జంక్షన్ అభివృద్ధి పనుల సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఉన్న మహనీయుల విగ్రహాలను అధికారులు తొలగించారు. తొలగించే సమయంలో అడ్డంకులు ఏర్పడ్డా.. అధికారులు సర్దిచెప్పి మరో చోట విగ్రహాలను అమరుస్తామని హామీ ఇవ్వడంతో అడ్డంకులు తొలిగాయి. కానీ ఇప్పటి వరకు ఆ విగ్రహాల అమర్చే ఊసే లేదు. రోడ్డు పక్కన ఓ మూలన అలా పెట్టారు. పనులు ముగిసినా విగ్రహాలను ప్రతిష్ఠించకపోవడంతో ఆయా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

తొలగించిన మహనీయుల విగ్రహాలు

జగద్గిరిగుట్ట చాకలి ఐలమ్మ విగ్రహం చౌరస్తా వద్ద జంక్షన్ అభివద్ధి పనులు పూర్తి చేశారు. ఇక్కడ ఎన్నో సంవత్సరాలుగా ఉన్న చాకలి ఐలమ్మ, ఎన్‌టీఆర్ విగ్రహాలను తొలగించారు. ఎన్‌టీఆర్ విగ్రహం రోడ్డు పక్కన ఓ అరుగుపై పెట్టారు. ఐలమ్మ విగ్రహాన్ని పాత సీపీఐ కార్యాలయంలో పెట్టారు. అదేవిధంగా ఐడీపీఎల్ జంక్షన్‌లో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగించారు.

అడ్డంకుల వల్లే ఆలస్యం

ఇతర ప్రధాన కూడళ్లలో జంక్షన్ పనులు కొనసాగుతున్నాయి. జగద్గిరిగుట్టలో జంక్షన్ పనులు పూర్తయ్యాయి. తొలగించిన చాకలి ఐలమ్మ, ఎన్‌టీఆర్ విగ్రహాలను త్వరలోనే ఇప్పుడున్న జయశంకర్ విగ్రహం వద్ద తిరిగి ప్రతిష్ఠిస్తాం. కొన్ని అడ్డంకులు ఎదురుకావడంతోనే విగ్రహాల ఏర్పాటు ఆలస్యమవుతుంది.

– తిరుపతి, గాజులరామారం సర్కిల్ ఏఈ

ఐలమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలి



జగద్గిరిగుట్ట చెక్‌పోస్ట్ సమీపంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని జంక్షన్ పేరుతో తొలగించారు. ఇప్పటి వరకు మళ్లీ ప్రతిష్ఠించలేదు. పనులు పూర్తి చేసి నెల గడుస్తున్న విగ్రహం మాత్రం పెట్టలేదు. వీలైనంత తొందరగా విగ్రహం ఏర్పాటు చేయాలి.

– నాగరాజు, రజక సంఘం డివిజన్ అధ్యక్షులు, జగద్గిరిగుట్ట.

సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తా



కూన శ్రీశైలంగౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

దుండిగల్: ప్రజలకు మేలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. మంగళవారం షాపూర్ నగర్‌లోని ఆయన నివాసంలో దుండిగల్ గ్రామ ప్రజలు కలిసి తమ సమస్యలను వివరించారు. గత బీఆర్ఎస్ హయాంలో దుండిగల్ గ్రామంలోని సర్వే నంబర్ 453, 454ల్లో ఆర్టీఓ కార్యాలయ ఏర్పాటు కోసం 40 ఎకరాల భూమిని కేటాయించిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు తమకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి మోసం చేశారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన కూన శ్రీశైలంగౌడ్.. దుండిగల్ గ్రామ ప్రజలు, రైతులు అధైర్యపడొద్దని, సమస్యను జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు గణేష్, మాజీ ఎంపీటీసీ బండారి మహేష్, మాజీ వార్డు సభ్యులు పిట్లా నాగార్జున, చెల్కల్ లక్ష్మణ్, పిట్లా సత్యనారాయణ, నాయకులు ఆకుల ప్రేమకుమార్ పటేల్, దొంతి మహేశ్, తలారి రాజకుమార్, కావాలి శశి కుమార్, పండగ శ్రీశైలం, చినంగి మల్లేష్, ఉప్పరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మిడిమిడి జ్ఞానం.. ధనార్జనే ధ్యేయం

- ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న నకిలీ వైద్యులు
- ముమ్మరంగా వైద్యాధికారుల తనిఖీలు
- ఇప్పటికే పలు క్లినిక్‌లకు నోటీసులు జారీ



నోటీసులు ఇస్తున్న వైద్యాధికారులు(ఫైల్)

నిజాంపేట్: ఎలాంటి అర్హతలు లేకుండానే కొందరు వైద్యులుగా చెలామణి అవుతున్నారు. మిడిమిడి జ్ఞానంతో ధనార్జనే ధ్యేయంగా వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఈ క్రమంలో వైద్యాధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఆసుపత్రి, క్లినిక్‌లకు నోటీసులు జారీ చేస్తున్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఎలాంటి అర్హత లేకపోయినా వైద్యం అందిస్తూ రోగులకు వివిధ మందులను సిఫారసు చేస్తున్నట్లు అధికారులు తనిఖీల్లో గుర్తించారు. లెటర్ ప్యాడ్‌లో డాక్టర్ అని రాసుకోవడాన్ని ఎన్ఎంసీ అధికారులు సీరియస్‌గా పరిగణించారు.

ముమ్మరంగా తనిఖీలు

మేడ్చల్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సోమవారం నియోజకవర్గ పరిధిలో మరోసారి తనిఖీలు చేపట్టారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ, మల్కాజిగిరి డివిజన్ ఇన్‌చార్జి డా.శోభరాజ్ నేతృత్వంలో బుచ్చిబాబు క్లినిక్‌లో మరోసారి తనిఖీలు జరిపారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నట్లు గుర్తించి నోటీసులు అందజేశారు. మల్లంపేటలోని మరో వైద్యశాల నిర్వాహకులకు సైతం నోటీసు అందజేశారు. పూర్తి నివేదికను డీఎంహెచ్ఓకు అందజేసి వారి నిర్ణయం ప్రకారం చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

తనిఖీలతో అప్రమత్తం

మేడ్చల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీల నేపథ్యంలో బాచుపల్లిలోని ప్రైవేట్ క్లినిక్‌ల నిర్వాహకులు, మెడికల్ షాపుల యజమానులు అప్రమత్తమయ్యారు. తమ క్లినిక్‌లు, మెడికల్ షాపులను మూసివేశారు. ప్రధానంగా మల్లంపేటలోని పలు క్లినిక్‌ల నిర్వాహకులు తమ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌కు తాళాలు వేసుకోవడం కనిపించింది. ఇదే విషయాన్ని మండల వైద్యాధికారి డా.స్వర్ణలత సైతం స్పష్టం చేయడం గమనార్హం.

భాగ్యరెడ్డి వర్మ సేవలు మరువలేనివి

మూసాపేట: ప్రముఖ సంఘసంస్కర్త మాదరి భాగ్యరెడ్డి వర్మ 86వ వర్ధంతిని మంగళవారం మూసాపేట గూడ్స్ షెడ్ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించారు. గ్రేటర్ హైదరాబాద్ ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షులు కర్క నాగరాజు అధ్యక్షత వహించారు. దళిత నాయకుడు కర్క పెంటయ్య ముఖ్య అతిథిగా హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరికీ విద్య అందించడానికి భాగ్యరెడ్డి వర్మ అలుపెరుగని కృషి చేసిన సామాజిక విప్లవకారుడని అన్నారు. కార్యక్రమంలో కర్క దాకయ్య, కర్క నర్సయ్య, గురజాల రాజు, పెరుమాండ్ల గోపాల్, బీఆర్ఎస్ నాయకులు నిఖిల్, సాయి, జగన్, దశరథ్, మహేష్, పాషా పాల్గొన్నారు.

వైభవంగా సీతారామచంద్ర స్వామి కల్యాణం



కల్యాణానికి హాజరైన కార్పొరేటర్‌ను సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ ప్రభాకర్ రెడ్డినగర్‌లో అభయాంజనేయ స్వామి ఆలయం పునర్నిర్మాణం అనంతరం మంగళవారం సీతారామచంద్ర ప్రభువు కల్యాణం వైభవంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ హాజరై స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో సాగర్, రాంరెడ్డి, దత్తు, సుదర్శన్ రెడ్డి, రాజు, శ్రీనివాస్, సాంబశివరెడ్డి పాల్గొన్నారు.

లింకు రోడ్డు ఏర్పాటు చేయాలని వినతి

జగద్గిరిగుట్ట: మగ్దూం నగర్ నుంచి హెచ్ఎంటీ పైపులైన్ రోడ్డుకు లింకు రోడ్డు ఏర్పాటు చేయాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య కోరారు. ఈ మేరకు మంగళవారం గాజుల రామారం డిప్యూటీ కమిషనర్ మల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ లింకు రోడ్డు వల్ల ట్రాఫిక్ సమస్య తగ్గుతుందన్నారు. దీనికి సానుకూలంగా స్పందించిన డీసీ.. లింకు రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

పాఠశాలలో ఫ్రూట్స్ అండ్ వెజిటేబుల్ డే



జీడిమెట్ల: చిన్నారులకు పండ్లు, కూరగాయల ప్రాధాన్యతను చిన్నతనంలోనే తెలియజేయాలని బోధివృక్ష ఒలంపియాడ్ స్కూల్ ప్రిన్సిపాల్ మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు ఫ్రూట్స్ అండ్ వెజిటేబుల్ డే ను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు భార్గవిరెడ్డి, వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు రాధిక, శ్రీజ, భవాని పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న కొలను వీరేందర్‌రెడ్డి

నిజాంపేట్ : మధురానగర్ కాలనీలోని అష్టలక్ష్మీ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి పలువురు దాతలు తమ వంతు ఆర్థిక సహాయాన్ని మంగళవారం అందజేశారు. బీఆర్ఎస్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్ రూ.50 వేలు, బాచుపల్లి మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి రూ.45,678, బాచుపల్లికి చెందిన కొలను కృష్ణారెడ్డి రూ.25 వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులు జి.విష్ణువర్ధన్‌రావు, సీహెచ్ లింగయ్య, రామలక్ష్మారెడ్డి, వరికుప్పల దశరథ్, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్‌లకు అందజేశారు.

రోడ్డ మధ్యలో స్తంభం.. తొలగించడంలో నిర్లక్ష్యం!



కుత్బుల్లాపూర్: విద్యుత్ మీటర్లు ఇవ్వాలన్న.. ప్యానెల్ బోర్డు ఏర్పాటు చేయాలన్న... ప్రైవేటు పనులు కాంట్రాక్టర్‌తో చకచక జరిపించే అధికారులు ప్రధాన రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. షాపూర్ నగర్ రంగా భుజంగా థియేటర్ సమీపంలో ఇటీవల రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా జంక్షన్ అభివృద్ధి కోసం ఇంజినీరింగ్ అధికారులు రోడ్డు వేశారు. రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాలను మాత్రం తొలగించలేదు. మధ్యలో ఉండటం వల్ల ప్రమాదం పొంచి ఉంది. అది తమ పరిధి కాదు అన్నట్లుగా బాధ్యతను అధికారులు విస్మరిస్తున్నారు. తరచూ ఇక్కడ ప్రమాదాలు చోటు చేసుకున్నా అధికారులు మాత్రం కళ్లు తెరవడం లేదు.

డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం



ప్రశంసాపత్రం అందజేస్తున్న సభ్యులు

చింతల్: అన్ని దానాల్లో కెల్లా రక్తదానం మిన్నా అని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ డైరెక్టర్ కె పిచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఏలియాస్ మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్ ఆధ్వర్యంలో చింతల్‌లోని భాగ్యరథి డిగ్రీ కళాశాలలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 50 మంది రక్తదానం చేశారు. వారికి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు నల్ల జైశంకర్ గౌడ్, నెవలి వెంకట్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ చల్ల గోవింద్ రెడ్డి, కూచిపూడి రామకృష్ణ, గంధం రమేష్ బాబు, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికలతో ముందుకెళ్లాలి



మాట్లాడుతున్న పుల్లెల గోపీచంద్

కుత్బుల్లాపూర్: సెయింట్ ఆంథోనీస్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ 25వ సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం కొంపల్లి జీబీఆర్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమానికి బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాలను సాధించే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. క్రమ శిక్షణ, పట్టుదల, అంకిత భావంతో కష్టపడితే విజయాలు చేకూరుతాయన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ కుసుమ కుమార్, విద్యా సంస్థల చైర్మన్ ఎస్‌పీ సుందర్ రాజ్, ప్రిన్సిపాల్ సరిత, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ దండమూడి కాలనీలో వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈనెల 13 నుంచి 18 వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి సేవా కాలం, మూల మంత్ర విశేషాలు, మహా పూర్ణాహుతి, చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం ఐదు గంటలకు అష్టాక్షరి మహామంత్ర హోమం భక్తుల సమక్షంలో వైద్య కృష్ణమాచార్యులు పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగద్గిరిగుట్ట: విద్యుత్ మరమ్మతుల కారణంగా జగద్గిరిగుట్ట సబ్ స్టేషన్ పరిధిలోని పలు కాలనీలలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రాధాకిషన్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు రాజీవ్ హిల్స్, షిరిడీ హిల్స్, భూదేవి హిల్స్, కూన మహాలక్ష్మి నగర్, అంజయ్య నగర్ సీ బ్లాక్‌లలో మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు జగద్గిరిగుట్ట, బీరప్ప నగర్, అంజయ్య నగర్, మైసమ్మ నగర సోమయ్య నగర్‌లలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

సుభాష్‌నగర్: మెట్‌కానిగూడ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ చైతన్య భార్గవ్ తెలిపారు. ఓక్షిత్ ఎన్‌క్లేవ్, వీనస్ ఎన్‌క్లేవ్, మోడి ఎలిగెన్స్, సోమిరెడ్డి వెంచర్, కృష్ణ మహాలక్ష్మి నగర్, మెట్‌కానిగూడ ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిజాంపేట్: మయూరి నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 33/11కేవీ మయూరి నగర్ సబ్ స్టేషన్ లక్ష్మీనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు లక్ష్మీనగర్, కేంద్రియ విహార్ రోడ్డు, మయూరి నగర్, రత్నదీప్ బ్యాక్ సైడ్ విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

సత్తయ్యకు సీపీఐ ఘన నివాళి



సత్తయ్య స్మారక స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

జగద్గిరిగుట్ట: సీపీఐ కుత్బుల్లాపూర్ మాజీ మండల కార్యదర్శి సత్తయ్య 7వ వర్ధంతిని మంగళవారం గుబురుగుట్టలోని ఆయన స్మారక స్థూపం వద్ద ఘనంగా నిర్వహించారు. గిరి నగర్, జగద్గిరిగుట్ట, గూడెంమెట్, లెనిన్ నగర్, రావి నారాయణరెడ్డి నగర్ వంటి అనేక బస్తీలను నిర్మించినటువంటి సత్తయ్య చిర స్థాయిలో నిలిచారన్నారు. మాజీ కౌన్సిలర్ నరసయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యేసు రత్నం, నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు హరినాథ్, మండల సహాయ కార్యదర్శి దుర్గయ్య, డీహెచ్‌పీఎస్ నాయకులు రాములు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు బాబు, మల్లేష్, మల్లయ్య, ఖాదర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే ఆర్టీసీ అభివృద్ధి



ఉద్యోగులకు బహుమతులు అందజేస్తున్న డిప్యూటీ ఆర్ఎం కవిత, డిపో మేనేజర్ హరి

మూసాపేట: ఉద్యోగుల అందరి సహకారంతోనే ఆర్టీసీ అభివృద్ధి సాధిస్తుందని డిప్యూటీ ఆర్ఎం కవిత అన్నారు. కూకట్‌పల్లిలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం పవర్ కార్యక్రమం నిర్వహించారు. పలువురు ఉత్తమ ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉద్యోగులు ఆర్టీసీ సంస్థ తమది అనే భావనతో పని చేసినప్పుడే సంస్థ అభివృద్ధిలో నడుస్తుందన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ హరి, ఎం.ఎఫ్. రాజేశ్వరి, ఓఎస్ రమేష్, వెల్ఫేర్ కమిటీ సభ్యులు శ్రీనివాస్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోయిన చెత్త.. తరలించకుంటే ఎట్ల!

కుత్బుల్లాపూర్ : జీడిమెట్ల డివిజన్ కాంటన్ పార్క్ గల్లీలో చెత్త డంపింగ్‌ను చేస్తున్నారు. ప్రధాన రోడ్డు కావడంతో వాహనదారులతో పాటు ప్రజలు అటువైపుగా రాకపోకలు సాగిస్తున్నారు. ఆ ప్రాంతం గుండా వెళ్లాలంటే తీవ్ర దుర్గంధం వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పారిశుద్ధ్య సిబ్బందితో చెత్తను తరలించే విధంగా చొరవ తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

